క్లుప్తంగా

అందుబాటులో వరి విత్తనాలు


ఆర్‌బీకేలో వరి విత్తనాల స్టాక్

ఎటపాక: మండలంలోని ఆర్‌బీకేల(రైతు భరోసా కేంద్రాల) ద్వారా ఖరీఫ్ సాగుకు విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్టు మండల వ్యవసాయాధికారి రాబిన్ సుదర్శన్ శుక్రవారం తెలిపారు.14 సచివాలయాల పరిధిలోని రైతులకు వరి విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. ఎంటియూ–1064, 1121,7029, 1061 రకాల వరి విత్తనాల స్టాక్ ఆర్‌బీకేల్లో ఉన్నట్టు తెలిపారు. మొత్తం 758 క్వింటాల్ల వరి విత్తనాలు ఉన్నట్టు పేర్కొన్నారు. విత్తన శుద్ధి, పచ్చిరొట్ట ఎరువులు అవసరమైన రైతులందరూ రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తీసుకోవాలని కోరారు.

మిడ్డే మీల్స్ వర్కర్లకు శిక్షణ తరగతులు


అవగాహన కల్పిస్తున్న ఎంఈవో తాతబ్బాయిదొర

వై.రామవరం: మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఎంఈవో కె.తాతబ్బాయిదొర ఆధ్వర్యంలో మండలంలోని మిడ్డే మీల్ వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన వంటల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో తాతబ్బాయి దొర మాట్లాడుతూ శిక్షన తరగతులను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. సీఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా కిన్నంగూడ-జనంగూడ మధ్యలో గల వంతెన

అరకులోయ రూరల్: మండలంలోని కిన్నంగూడ-జనంగూడ మధ్యలో గల వంతెన ప్రమాకరంగా మారింది. దీంతో వాహనచోదకులు ఈ మార్గం మీదుగా ప్రయాణించేందుకు భయపడుతున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం వంతెన నిర్మించారు. అయితే రక్షణగోడ నిర్మించకపోవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రయాణాల సమయంలోని వాహనదారులు తగు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాల బారిన పడే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

భానుడి ప్రతాపం


నిర్మానుషంగా మారిన మెయిన్‌రోడ్డు

కూనవరం: భానుడి ప్రతాపానికి కూనవరం శుక్రవారం అగ్నిగుండంగా మారింది. ఉదయం 11.00 గంటలకే రోడ్లు నిర్మాషంగా మారాయి. ప్రజలు వడగాడ్పులకు భయపడి తమ పనులను సైతం వాయిదా వేసుకుంటున్నారు. మధ్యాహ్నం 2.00 గంటలకు ఉష్ణోగ్రత చాలా ఎక్కువగా ఉండడంతో జనసంచారం పూర్తిగా ఇళ్లకే పరిమితమయ్యారు. విపరీతమైన ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు ఉక్కిబిక్కిరి అయ్యారు. సాయంత్రం 6గంటలు దాటినా వాతావరణం చల్లబడకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కశింకోట: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో విక్రయానికి మద్యం తరలిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. వారి నుంచి 20 బ్రాందీ సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అచ్చెర్లలో సీహెచ్ రాజు, జమాదులపాలెంలో ఎం.ఈశ్వరరావు చెరో పది బ్రాందీ సీసాలు తరలిస్తుండగా పట్టుకుని, అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

నాడు అధోగతి.. నేడు పురోగతి


బూదరాళ్లలో గ్రామ సచివాలయం


సెల్‌టవర్‌కు కేబుల్ పనులు చేస్తున్న సిబ్బంది

- అభివృద్ధి దిశగా బూదరాళ్ల పంచాయతీ
- రహదారుల నిర్మాణం
- 30 టవర్లు ఏర్పాటు
- ఇంటింటికీ కుళాయి


బూదరాళ్ల రహదారి


బూదరాళ్లలో ఏర్పాటు చేసిన టవర్

కొయ్యూరు: నాటి చీకటి పంచాయతీ..నేడు ప్రగతి వెలుగులో పరుగులు తీస్తోంది..గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కనీస అభివృద్ధికి బూదరాళ్ల పంచాయతీ నోచుకోలేదు. అప్పట్లో చంద్రబాబు పాలనలో బూదరాళ్ల పంచాయతీలో రహదారి, తాగునీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు సమాచార వ్యవస్థ లేక గిరిజనులు నానా అవస్థలు పడ్డారు. ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం.. అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలు అందక అమాయక గిరిజనులు మృత్యువాత పడిన సంఘటనలు కోకొల్లలు.. గ్రామాలకు అంబులెన్స్‌లు వెళ్లేందుకు దారి కూడా ఏర్పాటుచేయలేని దుస్థితిలో చంద్రబాబు ప్రభుత్వం పాలన సాగింది. టీడీపీ పాలకులు గ్రామాల్లో తాగునీటి సౌకర్యం ఏర్పాటుచేయకపోవడంతో సుదూరంలో ఊటగెడ్డలను గిరిజనులు ఆశ్రయించేవారు.. కలుషిత నీటి వినియోగంతో తరచూ రోగాల బారిన పడేవారు...వర్షం పడితే చిత్తడిదారుల్లో రాకపోకలకు నానా అవస్థలు పడ్డారు...టీడీపీ ప్రభుత్వ హయంలో గిరిజనులు సమస్యలతోనే సావాసం చేశారు... అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజన గ్రామాల రూపురేఖలు మారాయి...ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మన్యంలో ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పన కోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. దీంతో శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి కనిపిస్తోంది... ఇందులో భాగంగానే బూదరాళ్ల పంచాయతీల్లో అభివృద్ధి శరవేగంగా జరిగింది. బూదరాళ్ల పంచాయతీ అంటే అందరికి 1992లో నాటి చింతపల్లి ఎమ్మెల్యే పసుపులేటి బాలరాజు కిడ్నాప్ గుర్తుకు వస్తుంది. అలాంటి పంచాయతీలో అన్ని చోట్ల ఇప్పుడు ప్రగతి పనులు దర్శనమిస్తున్నాయి. రహదారుల నిర్మాణంతో రవాణా వ్యవస్థ మెరుగుపడింది. ఆయా ప్రాంతాల పరిధిలోని గిరిజను రైతులు వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను బస్సులు, ఇతర వాహనాల ద్వారా వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి విక్రయిస్తున్నారు. బూదరాళ్ల పంచాయతీలోని 35 గ్రామాల్లో 5300 మంది జనాభా ఉన్నారు. ఇందులో 4309 మంది ఓటర్లు ఉన్నారు. బూదరాళ్ల నుంచి చాపరాతిపాలెం వరకు రహదారి ఏర్పాటు చేశారు.దీంతో ఆ మార్గంలో ఉన్న సుమారు 20 గ్రామాల్లో అభివృద్ధి జరిగింది. రవాణా సౌకర్యం మెరుగుపడింది.

అభివృద్ధి పనులివీ

- రూ.5 కోట్లతో బూదరాళ్ల నుంచి చాపరాతి పాలెం వరకు రహదారి ఏర్పాటు. దీని మూలంగా చింతపల్లి వెళ్లేందుకు దూరంతో పాటు సమయం కూడా తగ్గింది. ఒకప్పుడు కొయ్యూరు నుంచి చింతపల్లి వెళ్లాలంటే కృష్ణాదేవిపేట మీదుగా వెళ్లేవారు. ఇప్పుడు చాపరాతిపాలెం మీదుగా వెళ్తున్నారు.దీని మూలంగా 35 కిలోమీటర్ల దూరం తగ్గింది.
- బూదరాళ్ల పంచాయతీ కేంద్రంలో సెల్ టవర్ నిర్మించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సాంకేతిక సమస్య పరిష్కారమైంది. సెల్ సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చాయి.
- సచివాలయ భవనాన్ని నిర్మించారు.
- దొడ్డవరం నుంచి లూసం వరకు దాదాపుగా 15 కిలోమీటర్ల రహదారి నిర్మించారు. దీంతో శివారు గ్రామాలకు అంబులెన్స్ వెళ్లేందుకు మార్గం సుగమం అయింది. అదే విదంగా నూకరాయి తోట నుంచి బాలరేవుల వరకు రెండు కిలోమీటర్ల దూరం మట్టి రోడ్డును వేశారు.
- మిషన్ కనెక్ట్ పాడేరులో భాగంగా బాలరేవుల నుంచి కునుకూరు మీదుగా పోకలపాలెం, చీడిపల్లి వరకు రోడ్డు వేశారు. దీని వలన పంచాయతీలో 12 గ్రామాలకు రహదారి సౌకర్యం కలిగింది.
- గరిమండ నుంచి వంతమర్రి మీదుగా నల్లబిల్లి వరకు బీటీ రోడ్డు మంజూరైంది. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో పూర్తి కానున్నాయి.
- ఇక పంచాయతీలో 30కి పైగా టవర్ల నిర్మాణం జరిగింది. వాటిలో పది వరకు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. ఎక్కువగా ఎయిర్‌టెల్, జియో టవర్లు ఏర్పాటు చేశారు.దీంతో కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుపడింది
- 18 గ్రామాలకు జల్‌జీవన్ మిషన్‌లో బాగంగా ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో కలుషిత నీటిని తాగే బాధ తగ్గింది.మరో పది గ్రామాలకు నీరు ఇచ్చేందుకు పనులు జరుగుతున్నాయి.

ఊహించని అభివృద్ధి



గడిచిన ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వ పాలనలో పంచాయతీలో ఊహించని అభివృద్ధి జరిగింది. అన్ని ప్రాంతాలకు రహదారులు, తాగునీరు, టవర్లు, భవనవాలను నిర్మించారు. దీంతో చాలా వరకు కష్టాలు తప్పాయి. రవాణా సౌకర్యం మెరుగుపడడంతో ఇప్పుడు చాలా గ్రామాల నుంచి మండల కేంద్రానికి రాకపోకలకు ఇబ్బందులు లేవు. శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి చేసిన జగనన్నకు గిరిజనులంతా రుణపడి ఉంటాం.

– ఎస్ సూరిబాబు, బూదరాళ్ల

ఆనందంగా ఉంది

ఇది వరకు రహదారి లేక చాలా అవస్థలు పడ్డాం. అత్యవసరమైతే అంబులెన్స్ కూడా వచ్చేది కాదు. ఇప్పుడు రహదారులు బాగుడడంతో వాహనాలు వస్తున్నాయి. చాలా మందికి ద్విచక్ర వాహనాలున్నాయి. వెంటనే మండల కేంద్రంకు చేరుకుంటున్నారు. రైతులు బస్సులు ఇతర వాహనాల ద్వారా అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి అమ్మకాలు చేస్తున్నారు. జగనన్న ప్రభుత్వంలో అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు దర్శనమిస్తున్నాయి. ఆనందంగా ఉంది.

– రమణమ్మ, బాలరేవుల

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం తథ్యం


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు

జి.మాడుగుల: సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం తథ్యమని వైస్ ఎంపీపీ, మండల నాయకుడు కుడుముల సత్యనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ అరకు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుమ్మ తనూజరాణి, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు నవరత్నాల పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన అన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రతీ గడపకు సంక్షేమ అభివృద్ధి పథకాలు అందించి ప్రజల వద్దకు ప్రభుత్వ పాలన చేర్చారన్నారు. ఇటువంటి ప్రజల వద్దకు పరిపాలన దేశంలో ఎక్కడా లేదని, అటువంటి ప్రభుత్వానికి ప్రజల మద్దతు మెండుగా ఉంటుందన్నారు. ఈ నెల 4వ తేదీన నిర్వహించే ఓట్లు లెక్కింపులో మెజార్టీ ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకొని జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా అధికార పీఠాన్ని అధిరోహిస్తారని ఆయన స్పష్టం చేశారు. నాయకులు బాలు, వంతాల వెంకటరమణ, శ్రీనివాస్, మాతే పండయ్య, పాండురాజు, బూత్ కమిటీ కన్వీనర్ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని పూజలు


పోశమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


దేవీపట్నం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని దేవీపట్నం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. పూడిపల్లి పంచాయతీలోని గండిపోసమ్మ ఆలయంలో ఎంపీపీ కుంజం మురళి, నాయకులు కందుల బాబ్జి, పెద్దబ్బాయిదొర, సత్యనారాయణ, మురళీకృష్ణ, గంగాధర్ తదితరుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఎమ్మెల్యేగా నాగుపల్లి ధనలక్ష్మి, ఎంపీగా తనుజారాణిలు అఖండ మెజార్టీతో విజయం సాధించి, వైఎస్సార్‌సీపీకి గతం కంటే ఎక్కువ సీట్లు సాధించి మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని ఆకాంక్షించారు.

ముమ్మరంగా ఉపాధి పనులు


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీవో చినఅప్పలనాయుడు

పెదబయలు: మండలంలోని 23 గ్రామ పంచాయతీ ల పరిధిలో వేగవంతంగా ఉపాధి పనులు జరుగుతున్నట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో చినఅప్పలనాయుడు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడాది మే నెలలో 8000 నుంచి 8500 మంది రోజువారీగా వేతనదారులు పనిచేస్తే ఈ ఏడాది ఈ నెలలో 10 వేల నుంచి 10,500 మంది రోజు వారీగా పనుల్లో పాల్గొంటున్నట్టు చెప్పారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీ ల పరిధిలో 360 గ్రామాలకు గాను 352 గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. మండలంలో ఎక్కువగా టెర్రాసింగ్, భూమి సదును, ట్రెంచీలు. ఫారంపాండ్స్ పనులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు మాత్రమే పనులు జరుగుతున్నాయని, ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో కనీస సదుపాయాలు అందుబాటులో ఉంచామన్నారు. అత్యధికంగా రోజువారీగా రూ.270 నుంచి రూ.280 వరకు రోజు వారీగా వేతనం పొందుతున్నట్టు చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత రైతులకు కావాల్సిన మొక్కల పంపిణీకి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా సమాచారం అందజేస్తామన్నారు.

సమన్వయం పాటించాలి


వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: ఈనెల 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ర్యాలీలు, సంబరాలు జరుపుకోవద్దని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, కానీ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మండల స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ర్యాలీలు, సభలు, వాట్సాప్‌లలో ఎటువంటి రెచ్చగొట్టే మెసేజ్‌లు పెట్టవద్దని నాయకులకు, కార్యకర్తలను కోరారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని నిబంధనలు అతిక్రమించి ఇబ్బందులు పడవొద్దన్నారు. జూన్ 19వ తేది తరువాత సంబరాలు అత్యంత వైభవంగా జరుపుకుందామని ,అంతవరకు సమన్వయం పాటించాలని ఆయన కోరారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు


చింతపల్లిలో దోమల నియంత్రణ మందును పిచికారీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది


రాజవొమ్మంగి గురుకుల కళాశాలలో మలేరియా దోమల నివారణ మందు స్ప్రేయింగ్ పనులు

చింతపల్లిరూరల్: మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్టిలో పెట్టుకుని దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చెపడుతున్నట్టు ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ అన్నారు.మండల కేంద్రంలో కుమ్మరవీధి, నెయ్యిల వీధి, మైలుకూలివీధి, ముఠాదారి వీధుల్లో శుక్రవారం దోమల నియంత్రణ మందును పంచాయతీ సిబ్బందితో పిచికారీ పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల కారణంగా మలేరియా, డేంగ్యూ వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు తమ ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కారదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థినీ, విద్యార్థులు దోమకాటు బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని రాజవొమ్మంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుష్మ కోరారు. శుక్రవారం డాక్టర్ సుష్మా ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో దోమల నివారణ మందు పిచికారీ పనులు ముమ్మరంగా జరిగాయి. కళాశాల లోపల బయట, డార్మెటరీలు, వంటశాలలో చేపట్టిన పిచికానీ పనులను సుష్మ స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థినులతో మాట్లాడుతూ అనారోగ్య సమస్యలుంటే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో వైద్యులను సంప్రదించాలన్నారు. దోమతెరలు వినియోగించాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. అనంతరం ఎస్‌యూఓ. ప్రసాద్ మాట్లాడుతు ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు రాజవొమ్మంగి పీహెచ్‌సీ పరిధిలోని 10, జడ్డంగి పీహెచ్‌సీ పరిధిలోని 5 పాఠశాలలు, వసతి గృహహాల్లో పిచికారీ పనులు ప్రారంభమైనట్టు చెప్పారు. ప్రిన్స్‌పాళ్లు, హెచ్ఎంలు, సిబ్బంది మలేరియా సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎంటీఎస్. సోమరాజు హెల్త్ అసిస్టెంట్ నానిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వెదురు పొదలు తగులబడిన దృశ్యం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గల వెదురు పొదలకు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో శుక్రవారం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అదే సమయంలో నీటి కోసం బోరు వద్దకు వచ్చిన మహిళలు, యువత స్పందించి మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. పాఠశాల భవనాలకు అతి సమీపంలో ఈ వెదురు పొదలు ఉన్నాయి, మంటలు పెద్దగా వ్యాపించి ఉంటే ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో తరచు అవాంఛనీయ సంఘటనలు జరుతున్నాయ ని స్థానికులు చెబుతున్నారు. వారం రోజుల క్రిందట ఈ పాఠశాలకు చెందిన క్రీడాస్థలాన్ని కొందరు ఆక్రమించి కంచె వేయడం వివాదాస్పదమైంది. అలాగే అల్లరి మూకలు చేరి పాఠశాల ఆవరణలో గల వెదురు పొదలు, చెత్తకు నిప్పు పెట్టడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. పాఠశాల రక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్థానికులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆత్మీయ సన్మానం



రమణ దంపతులను సత్కరిస్తున్న జీసీసీ డివిజనల్ మేనేజర్ దేవరాజు

చింతపల్లి రూరల్: చింతపల్లి గిరిజన సహకార సంస్థలో సీనియర్ అకౌంటెంట్, పెట్రోల్ బంక్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన చిటికెల రమణ శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక జీసీసీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది వీడ్కోలు సభ ఏర్పాటు చేసి, రమణ దంపతులను సత్కరించారు. జీసీసీ డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు మాట్లాడుతూ రమణ జీసీసీకి ఎనలేని సేవలందించారన్నారు. జీసీసీలో సుదీర్ఘ కాలం వివిధ హోదాల్లో పనిచేసి రమణ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. సేల్స్‌మెన్‌లు, శ్యాండీ ఇన్‌స్పెక్టర్లు, ,సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో దోమలమందు పిచికారీ ప్రారంభం


పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాలలో దోమలమందు పిచికారీను పరిశీలిస్తున్న వైద్యాధికారి నరేంద్ర

వై.రామవరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో దోమలమందు పిచికారీ పనులను చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారులు దినేష్, నరేంద్రల పర్యవేక్షణలో మలేరియా టెక్నీషియన్ పల్లాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని చామగడ్డ, పనసలపాలెం ఆశ్రమ పాఠశాలలతో పాటు పి.గర్రగొండ ఏకలవ్య, గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం ఏసీయం 5శాతం అనే దోమల మందు పిచికారీ చేశారు.ఈ సందర్భంగా వైద్యాధికారి నరేంద్ర మాట్లాడుతూ మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీ పరిధిలోని 41 గ్రామాల్లో మొదటి విడత దోమలమందు పిచికారీను పూర్తి చేశామన్నారు. జూన్ నెలలో పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా మండలంలోని అన్ని పాఠశాలల్లోను దోమల మందు పిచికారీను ప్రారంభించామన్నారు. చవిటిదిబ్బలు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాలకు దుప్పట్లు, జంబుఖానాలు


ఏకలవ్య పాఠశాలలో భద్రపరుస్తున్న దుప్పట్లు, జంబుఖానాలు

రాజవొమ్మంగి: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలకు శుక్ర వారం 253 దుప్పట్లు, 253 జంబుఖానాలు వచ్చా యి. కళాశాల పునఃప్రారంభమైన తరువాత ప్రతి విద్యార్థికి ఒక దుప్పటి, ఒక జంబుఖానా అందజేయనున్నట్టు ప్రిన్స్‌పాల్ సలోమి తెలిపారు. వాటిని ఒక చోట భద్రపరచామన్నారు. రానున్న వర్షా కాలం, చలికాలంలో విద్యార్థులకు జంబుఖానాలు, దుప్పట్లు ఎంతో ఉపయోగకరమన్నారు. స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూలుకు 300 దుప్పట్లు, 300 జంబుఖానాలు వచ్చాయని ప్రిన్సిపాల్ ఎంవీ కృష్ణారావు చెప్పారు. ఈ పాఠశాలలో మొత్తం 300 మంది చదువుతుండగా పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు సరఫరా అయినట్లు పేర్కొన్నారు. వై.రామవరంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌కు అవసరమైన దుప్పట్లు, జంబుఖానాలు శుక్రవారం వచ్చాయని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. పాఠశాలల్లో 480 మంది చదువుకొంటున్నారని, వీరందరికి పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు.